ప్రేమలతకు ఓయూ పీహెచ్‌డీ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హబ్సిగూడకు చెందిన ఎం.ప్రేమలత ప్రభాకర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) అవార్డు ప్రదానం చేసింది. శివరాంపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీ కేంద్రీయ విద్యాలయంలో పీజీటీగా పనిచేస్తున్న ప్రేమలత..ఓయూకు చెందిన డాక్టర్ దుర్గేశం పర్యవేక్షణలో 'సెకండరీ స్థాయిలో ఇంగ్లిషు భాష బోధన పద్ధతులు' అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు.

విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్ల మార్పు

బోడుప్పల్: చిలుకానగర్ ఏఈ పరిధిలోని విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్ 871247599, లైన్ ఇన్‌స్పెక్టర్లు 8712471591, 8712471592, హబ్సిగూడ డివిజన్ కంట్రోల్‌రూమ్ 8712471612, హబ్సిగూడ సర్కిల్ కంట్రోల్‌రూమ్ 8712471466, చిలుకానగర్ ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి 8712471576 ఫోన్ నంబర్లు మారినట్లు వెల్లడించారు. వినియోగదారుల విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఫిర్యాదులకు ఈ కొత్త నంబర్లను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



గౌతంనగర్: డివిజన్ యాదవనగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో లక్ష్మీ అమ్మవారికి వైశాఖ అమావాస్య సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 41 కిలోల మల్లెపూలతో అర్చన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శివ శంకర ఆలయంలో..

ఉప్పల్: శివ శంకర మహామాయి దేవాలయంలో వైశాఖ అమావాస్య సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బలవంతచారి మాట్లాడుతూ.. ప్రతినెల అమావాస్య రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అన్నప్రసాద వితరణ చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ ఆత్మగౌరవ భవన చైర్మన్ వెంకటాచారి, ఉప్పోజి బిక్షపతి, శ్రీను, రాజగోపాల్ తదితరులున్నారు.

క్రీడా అకాడమీ వసతి గృహాల్లో ప్రవేశాలకు ఎంపిక

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్) ఆధ్వర్యంలోని వివిధ క్రీడా అకాడమీ, వసతి గృహాలలో ప్రవేశాలకు ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టినట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యువజన, క్రీడల అధికారి జీవీ గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సంస్థ 2025–26 సంవత్సరానికి గాను ఎనిమిది రీజినల్ స్పోర్ట్స్ వసతి గృహాలు, అకాడమీలలో మంజూరైన ఖాళీలను భర్తీ చేసేందుకు క్రీడల ఎంపిక పోటీలను జూన్ 1, 13వ తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సంబంధిత అకాడమీలలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అర్హులైన, ఆసక్తి గల బాలురు, బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్: 76609 19518.

ఫోర్జరీ సంతకంతో ప్లాట్ రిజిస్ట్రేషన్.. వ్యక్తిపై కేసు

పోచారం: ఫోర్జరీ సంతకంతో ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. కొర్రెముల్‌లోని ఏకశిలానగర్ వెంచర్‌లో సీతాఫల్ మండికి చెందిన సీహెచ్ రమణారావుకు 200 చదరపు గజాల ప్లాటు ఉంది. ప్లాటు డాక్యుమెంట్‌ను తనఖా పెట్టి ఎస్.కోటేశ్వరరావు వద్ద రమణారావు కొంత డబ్బు అప్పుగా తీసుకున్నారు. కొద్ది కాలం తర్వాత అప్పు తీర్చినప్పటికీ, అనివార్య కారణాల వల్ల డాక్యుమెంట్‌ను రమణారావు తీసుకోలేదు. ఇదే అదనుగా చేసుకొన్న కోటేశ్వరరావు ఆ ప్లాటును పోర్జరీ సంతకంతో తొలుత తన పేరు మీద, తర్వాత తన కూతురు పేరు మీద డాక్యుమెంట్ చేయించుకున్నాడు. ఈ విషయం రమణారావుకు ఆలస్యంగా తెలియడంతో పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరోచోట బేస్‌మెట్ తొలగించి ప్లాటు కబ్జా..

కొత్తపేటకు చెందిన లింగస్వామికి కొర్రెముల్‌లోని సర్వే నంబర్లు 710, 711లో 100 చదరపు గజాల ప్లాటు ఉంది. దీని చుట్టూ బేస్‌మెట్ కూడా నిర్మించారు. ఇటీవల ఈ ప్లాట్ చుట్టూ ఉన్న బేస్‌మెట్‌ను దేవిడ్‌రెడ్డి అనే వ్యక్తి తొలగించి, తిరిగి కొత్తగా నిర్మించేందుకు చుట్టూ కందకం తవ్వించాడు. ఈ విషయం లింగస్వామికి తెలియడంతో పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు నెలల బియ్యం ఒకేసారి!

లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం

- జూన్, జూలై, ఆగస్టు కోటా జూన్ 1 నుంచి 30 వరకు పంపిణీ
- ఉప్పల్ రేషన్ సర్కిల్ – 2లో 222 రేషన్ షాపులు
- కొత్తవి, పాతవి కలుపుకొని 1,84,801 రేషన్‌కార్డులు



లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ (ఫైల్)

రామంతాపూర్: వర్షాకాలంలో వచ్చే వరదల కారణంగా ఆహార ధాన్యాల నిల్వ, రవాణాలో ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో 3 నెలల రేషన్ కోటాను లబ్ధిదారులకు జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు రేషన్‌షాపుల ద్వారా అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఉప్పల్ రేషన్ సర్కిల్ –2లో ఉన్న 222 రేషన్ దుకాణాల్లో జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

స్థలం లేకపోవడంతో నెలలో మూడుసార్లు

రేషన్ షాపుల్లో 3 నెలల రేషన్ కోటా నిల్వలు ఉంచడానికి స్థలం లేకపోవడంతో నెలలో మూడుసార్లు గోదామ్‌లో నుంచి బియ్యం సరఫరా చేయాలని అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం. 3 నెలల రేషన్ బియ్యం బస్తాలను నిల్వ చేసుకునే సౌకర్యం ఉన్న డీలర్లకు ఒకేసారి సరఫరా చేసే అవకాశం ఉంది. ఉప్పల్ రేషన్ సర్కిల్ పరిధిలో ఉన్న రేషన్‌షాప్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి 3 నెలల రేషన్ పంపిణీపై డీలర్లకు పౌర సరఫరాశాఖ అధికారులు అవగాహన కల్పించారు.

బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నాం..



ఉప్పల్ రేషన్ సర్కిల్–2 పరిధిలోకి వచ్చే ఉప్పల్, రామంతాపూర్, నాగోల్, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, కాప్రా, అల్వాల్ తదితర ప్రాంతాల్లో ఉన్న 222 రేషన్ షాపులకు 3 నెలలకు సరిపడా బియ్యం, గోధుమలు సరఫరా చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. పంపిణీలో పారదర్శకతకు ఈ– పాస్, బయోమెట్రిక్ విధానాలు అమలు చేస్తున్నాం. కొత్త కార్డు వివరాలు ఆధార్‌కార్డు నెంబరును రేషన్ డీలర్‌కు అందజేసి సమాచారం పొందవచ్చు.

– సంధ్య, అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్, ఉప్పల్ రేషన్ సర్కిల్–2

అన్ని రేషన్ దుకాణాల్లో ఏర్పాట్లు పూర్తి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం మూడు నెలల రేషన్ (బియ్యం, గోధుమలు) కోటా జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు ఆహార భద్రత లబ్ధిదారులకు అందజేయడానికి రేషన్ షాపుల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాం. రేషన్ డీలర్లకు ఈ కోటా పంపిణీపై అవగాహన కల్పించాం.

– శంకర్, రామంతాపూర్–హబ్సిగూడ డీలర్ల సంఘం అధ్యక్షుడు

మహిళలు సామాజికంగా చైతన్యం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శిల్పారెడ్డి

మల్లాపూర్: మహిళలు సామాజిక, రాజకీయంగా చైతన్యం కావాల్సిన అవసరం ఉందని, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి అన్నారు. మంగళవారం నాచారంలోని బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో రమాబాయి అంబేడ్కర్ వర్ధంతి, స్త్రీవాద రచయిత చలంగారి జయంతి సందర్భంగా నాచారం మహిళా జేఏసీ ఆవిర్భావ సభను నిర్వహించారు. జేఏసీ సంస్థల వ్యవస్థాపకులు నల్లారాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డాక్టర్ శిల్పారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మెరుగైనా సమాజ స్థాపనకు అన్ని రకాల జేఏసీలు ఏర్పాటు చేశారో.. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కమిటీలు వేయాలని సూచించారు. టీపీసీసీ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు చింతల నిర్మలారెడ్డి, తులిప్స్ విద్యా సంస్థల యాజమని పద్మిని, విద్యాశాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ సరోజిని, జేఏసీ నాయకురాలు పైనోజి మనోహర, ధర్మవతి, నీల, కనక తదితరులున్నారు.

రూ.14 లక్షలతో సీసీరోడ్డు పనులు

అల్వాల్: వెంకటాపురం డివిజన్‌లో రూ.14 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులకు మంగళవారం కార్పొరేటర్ సబితాఅనీల్‌కిషోర్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. విజయ్‌శేఖర్, ప్రకాష్‌గౌడ్, సయ్యద్ మోసిన్, రాజేందర్, నర్సింగ్, సాయిబాబా, ఫరీద్, మురళీగౌడ్, ముత్యాలు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సబిత

డివిజన్ అభివృద్ధికి కృషి



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ సత్యం కాలనీలో రూ.26 లక్షలతో సీసీరోడ్డు పనులకు మంగళవారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మచ్చబొల్లారం డివిజన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానన్నారు. డివిజన్ అధ్యక్షుడు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, స్వామి, దేవేందర్, వెంకటేష్, కాలనీవాసులు విజయ్‌కృష్ణ, శ్రీకాంత్, జగదీశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుమలయ్య, ఆనంద్, రాజిరెడ్డి, అనిల్‌రెడ్డి, లావణ్య, విజయలక్ష్మి, వెన్నెల, యమున, సువర్ణ తదితరులున్నారు.

వేడుకగా 'బైబిల్ బోధనలు'

ఉప్పల్: మున్సిపల్ గ్రౌండ్‌లో గత రెండ్రోజులుగా నిర్వహిస్తున్న పెంతెకోస్తు మిషన్ చర్చి బైబిల్ బోధనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో క్రైస్తవ డినామినేషన్‌లు, ఇండిపెండెంట్ చర్చిల విశ్వాసులు, పాస్టర్లు పాల్గొని బైబిల్ బోధనలు చేశారు.

కంపెనీ ఎదుట కార్మికుల ఆందోళన

మేడ్చల్‌రూరల్: 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలంటూ మేడ్చల్ మున్సిపాలిటీ పూడూర్ పరిధిలోని టైమ్‌టెక్నో కంపెనీ ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కంపెనీ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ కంపెనీలో కార్మికులు 8 గంటలు కాకుండా 12 గంటలు పని చేయాలని యాజమాన్యం ఒత్తిడి చేయడం సరికాదన్నారు. కంపెనీలో డ్రమ్ములు తయారవుతున్నందున కార్మికులు వేడి వాతావరణంలో పనిచేయాల్సి ఉంటుందని 12 గంటల పాటు పనిచేస్తే ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. యాజమాన్యం పనిగంటల మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరేశ్, కార్మికులు పాల్గొన్నారు.

కోతుల సమస్య పరిష్కరించాలని వినతి

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లో కోతుల సమస్య పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో స్థానికులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. కోతులు ఎక్కువై ఇళ్లలోకి వచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని లేఖలో కోరారు. చిన్న పిల్లలను బయటకు పంపించాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉందని, పాదచారులపై, ద్విచక్రవాహనాలపై దాడి చేస్తున్నాయని తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి కోతుల నుంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో శ్రీశైలం, వెంకటేశం, కుమారస్వామి, శ్రీనివాస్, రాజయ్య, శ్రావణ్, హరి పాల్గొన్నారు.

గోధుమకుంటలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

కీసర: కీసర మండలంలోని గోధుమకుంటలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ జి.శ్రీదేవి, ప్రొఫెసర్ డాక్టర్ సందీప్‌కుమార్, ఎస్.విక్రమ్, నిహారిక, ఎంఏవో మాధవిలత, ఏఈవో రాజ్‌కుమార్ హాజరయ్యారు. చీడ, పీడ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రత్యేక చర్యలు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, వానాకాలం పంటల సాగుపై సంబంధిత అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు ఎప్పటికప్పుడు సమీక్షలు, పర్యవేక్షణతో ముందడుగు వేస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన మంగళవారం మాట్లాడారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని, నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టి, నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. భూ భారతిపై అవగాహన సదస్సులు నిర్వహించి భూ భారతి చట్టాన్ని ప్రజలకు చేరువ చేయాలన్నారు. జూన్ 3 నుంచి 20 వరకు మూడోదశ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు చాలా కీలకమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలన్నారు. 29, 30 తేదీల్లో జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు సంబంధిత జిల్లాల్లో పర్యటించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరు గౌతమ్‌తో సహా జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, ఆర్డీఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వాహన తనిఖీ సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి

డీసీపీ కోటిరెడ్డి



మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో సమీక్ష సమావేశంలో డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్‌రూరల్: వాహనాలను తనిఖీ చేసే సమయంలో, పెట్రోలింగ్ సమయంలో సిబ్బంది తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను మంగళవారం మేడ్చల్ జోన్ ఏసీపీ శంకర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వాహన తనిఖీ నిర్వహించే సిబ్బంది విధులు, వారి బాధ్యతలు, విధి నిర్వహణలో ఉన్నప్పుడు చేయాల్సిన, చేయకూడని పనులను సిబ్బందికి వివరించారు. ఇటీవల శంషాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెట్రోలింగ్ వాహనంపైకి లారీ దూసుకువచ్చి ఓ కానిస్టేబుల్ ప్రాణాలను కోల్పోగా, మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలైన ఘటన గురించి సిబ్బందికి తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలను పరిశీలించిన ఆయన పెట్రోల్ మొబైల్ యూనిట్లు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం మేడ్చల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సంఖ్య, క్రైం రేటు, కేసుల నమోదు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. బక్రీద్ పండగ సమీపిస్తున్నందున పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డీఐ కృష్ణ ప్రసాద్, ఎస్సై అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు



బోరు మరమ్మతులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్



మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

మల్కాజిగిరి: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకున్నామని, మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఓల్డ్ మల్కాజిగిరిలో బోరు మరమ్మతులను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. జలమండలి అధికారులు గతంలో పాడైపోయిన బోర్లను అందుబాటులోకి తీసుకుని రావడానికి ఆసక్తి చూపలేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి నివారణకు వారిపై ఒత్తిడి తీసుకొచ్చి పలు కాలనీల్లో పాడైపోయిన బోర్లను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా కొన్నిచోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేయించామన్నారు. వర్షాకాలంలో ప్రజలందరూ కూడా ఇంటివద్ద ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు.

గౌతంనగర్: డివిజన్ యాదవ్‌నగర్ ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలోని బోర్ పంప్‌సెట్ పనిచేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో సంబంధిత అధికారులను ఆయన ఆదేశించి మరమ్మతులు చేయించారు. బీఆర్ఎస్ నేతలు జేఏసీ వెంకన్న, రాముయాదవ్ ఉన్నారు.

అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని..



ధర్నా చేస్తున్న కాలనీవాసులు

కార్పొరేటర్ ఇంటి ఎదుట ధర్నా

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని బాలకృష్ణనగర్ వీధి నెంబర్–3లో డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు పనులను వెంటనే ప్రారంభించాలని, మంగళవారం స్థానికులు కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్‌రావు ఇంటి ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేటర్ భర్త అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి మంజూరైన పనులను నిలిపేయిస్తున్నారని ఆరోపించారు. తమ వీధిలో వెంటనే పనులను ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఉప్పల్ పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని సమీక్షించారు.

కార్పొరేటర్ హామీతో సద్దుమణిగిన వివాదం

బాలకృష్ణనగర్‌లో డ్రైనేజీ పనులను తాము అడ్డుకోలేదని ఇలాంటి దుష్ప్రచారం చేయడం సరికాదని, పరిస్థితిని సమీక్షించిన అనంతరం దశలవారీగా భూగర్భ డ్రైనేజీ పనులను పూర్తిచేస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

జర్నలిస్టులకు శిక్షణ తరగతులు



ఉప్పల్: మేడ్చల్ జిల్లా జర్నలిస్టులకు జూన్ 9,10 తేదీల్లో నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో శిక్షణ తరగతులను ఏర్పాటు చేయనున్నట్లు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండ్రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. శిక్షణకు హాజరైన వారికి సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు వివరించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డమీది బాలరాజు, వెంకటరామిరెడ్డిలు మంగళవారం అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి శిక్షణ తరగతులను ఏర్పాటు చేయాలని కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

విదేశాల్లో ఉద్యోగాలని మోసం..

పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థులు

అల్వాల్: విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయంటూ మోసం చేసిన ఓ కార్పొరేట్ కళాశాల ఉద్యోగిపై అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు 'విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, నమ్మబలికి కళాశాల అన్ని విధాలుగా సరిచూసింది.. మీరు దరఖాస్తు చేసుకొండంటూ' సూచించారు. దీంతో 5 మంది విద్యార్థులు ఆ సంస్థలకు దరఖాస్తు చేసుకోవడంతో పాటు ఒక్కొక్కరు రూ.10 లక్షల నగదును చెల్లించారు. అనంతరం సదరు సంస్థ నుంచి ఉద్యోగపత్రాలు సైతం వచ్చాయి. కానీ వాటిని విద్యార్థులు నిర్ధారణ చేసుకుంటే నకిలీవని తేలింది. దీంతో కళాశాలలో పనిచేస్తున్న ప్లేస్‌మెంట్ ఆఫీసర్ దివాకర్‌ను ఈ విషయంపై నిలదీశారు. వివరాలు తెలుసుకుంటానని, ఆయన కొద్దిరోజులు గడువు అడిగాడు. నెలలు గడుస్తున్నా.. విద్యార్థులకు ఉద్యోగం, డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో రెండ్రోజుల క్రితం కళాశాల వద్ద నిరసనకు దిగారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ ఆడియో వైరల్...

విద్యార్థులకు అల్వాల్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్సై మాట్లాడుతున్నట్లు ఆడియో సందేశం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. విదేశాల్లో ఉద్యోగాల విషయమై కళాశాలలో నిరసన తెలుపుతున్న విద్యార్థులకు ఎస్సై ఫోన్‌చేసి.. 'మీకు కళాశాల వారు ఇచ్చిన సమయం ముగియక ముందే ఎందుకు గొడవ చేస్తున్నారంటూ..? మీపై కేసులు నమోదు చేస్తామని, భవిష్యత్తులో మీకు ఉద్యోగాలకు ఇబ్బంది పడుతారంటూ'.. బెదిరించినట్లు ఆడియో ఉందని, విద్యార్థులు వాపోతున్నారు. దీనిపై పోలీస్ ఉన్నతాధికారులు సైతం విచారణ చేపట్టినట్లు సమాచారం.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని..

రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణాను కలిసిన ఎమ్మెల్యే



ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉప్పల్: చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి గతంలో పంపిన ప్రతిపాదనలను వెంటనే మంజూరు చేయాలని మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్‌లు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణాను కలిసి వినతి పత్రం అందజేశారు. చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అవసరాలకు అనుగుణంగా సరైన తరగతి గదులు లేవని, అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, గతంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నర్సింహారెడ్డిని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించి రూ.2.36 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించారని గుర్తు చేశారు. త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని ప్రిన్సిపల్ సెక్రటరీ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

నిర్వహణ లేక.. అలంకార ప్రాయంగా..

- నిరుపయోగంగా బయో టాయిలెట్లు
- అధికారులు పట్టించుకోవాలని డిమాండ్



సాయినగర్ చౌరస్తాలో నిరుపయోగంగా టాయిలెట్

గౌతంనగర్: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ఏర్పాటుచేసిన బయో టాయిలెట్లు సరైన నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన టాయిలెట్లను పట్టించుకోకపోవడంతో ఓ వైపు ప్రజాధనం వృధా అవుతుండగా.. మరోవైపు ఏ లక్ష్యంతో ఏర్పాటు చేశారో.. అది నెరవేరడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజల్లో అవగాహన లోపం..

సర్కిల్ పరిధిలోని మిర్జాలగూడ, మల్కాజిగిరి, సాయినగర్‌తో పాటు పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన మూత్రశాలలు నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో అలంకారప్రాయంగా మారుతున్నాయని, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బయో టాయిలెట్ల నిర్వహణతో పాటు స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు. రద్దీగా ఉన్న ప్రాంతాలను గుర్తించి టాయిలెట్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లక్షలు వెచ్చించినా ఫలితం శూన్యం..



బయో టాయిలెట్ల నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. లక్షల రూపాయలు వెచ్చించినా ఫలితం లేకుండా పోయింది. దీనికితోడు ప్రజల్లోనూ సరైన అవగాహన లేకపోవడం దీనికి కారణం. అధికారులు స్పందించి నిర్వహణతో పాటు అవగాహన కల్పించాల్సి ఉంది.

– మాశెట్టి అనిల్, గౌతంనగర్